క్లుప్తంగా

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధి కుమ్మరిపాలెంలోని డాక్టర్ కేఎల్ రావు హెడ్‌వాటర్ వర్క్స్‌లో 16 ఎంఎల్‌డీ(పాతది), 5 ఎంజీడీ పంపింగ్‌లైన్ మరమ్మతులను బుధవారం రాత్రి నుంచి చేయనుండటంతో గురువారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని మల్లికార్జునపేట, శ్రీనగర్‌కాలనీ, లబ్బీపేట, గవర్నర్‌పేట, రెహమాన్‌పార్కు, గులామొహిద్దీన్‌నగర్, గుప్తా కళ్యాణమండపం, కుమ్మరిపాలెం ఏరియా, నిమ్మతోట, శ్రీనివాస్ మహల్, ఫిష్‌మార్కెట్, గాంధీబావి, అంబేడ్కర్‌నగర్, గాంధీజీ హైస్కూల్, రథం సెంటర్, పూలబావి, కొట్టేటి కోటయ్య వీధి, నైజాం గేటు ప్రాంతాల్లో ఈ నెల 8వ తేదీ నీటి సరఫరా జరగదని మరమ్మతులు పూర్తైన వెంటనే పునరుద్ధరిస్తామని ఆయన వివరించారు. ఆయా ప్రాంతవాసులు ముందుగానే నీటి నిల్వలు చేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నగరంలో యాంటీ లార్వా ఆపరేషన్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో పెరుగుతున్న దోమల నివారణకు యాంటీ మలేరియా ఆపరేషన్లు నిర్వహించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు వీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యాన మంగళవారం నగరంలోని పలు ప్రధాన కాల్వల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేశారు. నగరంలో ప్రజలకు దోమకాటుతో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండటానికి మలేరియా సిబ్బంది మంగళవారం 30వ వార్డు దేవినగర్ బుడమేరు కెనాల్, 57వ వార్డు కొత్త ఆర్‌ఆర్‌పేట, బుడమేరు కాలువ, ఎంఎల్ ఆయిల్ స్ప్రే, 60వ వార్డు వాంబే కాలనీ కల్వర్ట్ పవర్ స్ప్రే, 61 వ వార్డు పాయకాపురం చెరువు తూటుకాడ, గుర్రపుడెక్కలను తొలగించి మలేరియా సిబ్బంది శుభ్రం చేశారు.

26 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 26 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 26 మందిపై 5వ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. 26 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 8 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదుచేస్తామని చెప్పారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని మంగళవారం నున్న సీఐ పి.కృష్ణమోహన్ అరెస్ట్ చేశారు. రాణిమేకల రాంబాబు, సలోమి అనే వ్యక్తులు వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే సీఐ తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేసి అరెస్ట్ చేశారు. సింగ్‌నగర్‌కు చెందిన విటుడు కరీమ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఘాట్‌రోడ్డు పనులు, కొండ చరియలు విరిగి పడకుండా ఐరన్ మెష్ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పనుల నేపథ్యంలో ఘాట్‌రోడ్డు మీదగా రాకపోకలను మూడు రోజుల పాటు దేవస్థానం నిలిపివేసింది. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్, పార్కింగ్ ఏరియాల మధ్య కొండ రాళ్లు విరిగిపడకుండా ఐరన్ మెష్ ఏర్పాటు పనులను చేపట్టారు. మరో వైపున ఘాట్‌రోడ్డు మూసివేయడంతో భక్తులు, యాత్రికులు ఇబ్బందులకు గురి కాకుండా దేవస్థానం సీతమ్మ వారి పాదాల వద్ద ప్రత్యేక హోర్డింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లతో పాటు సొంత వాహనాలపై వచ్చే యాత్రికులను హోర్డింగ్ పాయింట్‌కు తరలించింది. మరో వైపున మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనం, రూ. 100, రూ.300, రూ. 500 టికెట్లను కొనుగోలు చేసి క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకున్నారు. మంగళవారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగానే కొనసాగింది.

డ్రెయినేజ్‌లపై యథేచ్ఛగా నిర్మాణాలు

- సత్యనారాయణపురంలో వ్యాపారుల నిర్వాకం
- కాల్వల్లో పూడిక తీయడానికి వీలు లేని వైనం
- పారిశుద్ధ్య సమస్యతో స్థానికుల ఇక్కట్లు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు



ఎస్‌ఆర్‌పీ రోడ్డులో డ్రెయిన్‌పై శాశ్వతంగా స్టీల్ రెయిలింగ్‌తో ఆక్రమణలు



శివాలయం సెంటర్‌లో డ్రెయిన్ ఆనవాళ్లే లేకుండా దుకాణదారుల ఆక్రమణలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వ్యాపార సముదాయంగా పేరుగాంచిన ఎస్‌ఆర్‌పీ రోడ్డు, శివరావువీధి, శివాలయంవీధి, జీఎస్ రాజు వీధి తదితర ప్రాంతాల్లో షాపుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా సైడు డ్రెయిన్‌లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. దీంతో మురుగునీటి పారుదలకు తీవ్ర ఆటంకం కలగటంతో పాటు పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. సిబ్బంది పూడిక తొలగించేందుకు కూడా అవకాశం లేకుండా పోతుంది. కొనుగోలుదారులతో ఎప్పుడు రద్దీగా ఉండే ఎస్‌ఆర్‌పీ రోడ్డులో కొంత మంది వ్యాపారులు సైడు కాలువలను ఆక్రమించుకుని వాటిపై శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కొందరు బడ్డీ కొట్లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు కాలువలను పూర్తిగా మూసివేసి రెయిలింగ్‌లతో శాశ్వత కట్టడాలు చేపట్టారు. ఇంకొంతమంది కాలువలను పూర్తిగా మూసివేసి వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. జీఎస్ రాజురోడ్డులోని పాత పోలీస్ స్టేషన్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఏకంగా డ్రెయిన్‌పైనే హోటల్స్ నిర్వహిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా నెలకొంటుంది. పాదచారులు నడిచేందుకు సైతం దారి లేకుండా ఫుట్‌పాత్‌లనూ వదలకుండా షాపులు ఏర్పాటు చేయడంతో స్థానికుల రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మురుగులోనే రాకపోకలు...

దుకాణదారులు వ్యర్థాలను కాలువల్లోనే పడేయడంతో అక్కడ తీవ్ర పారిశుద్ధ్య సమస్య నెలకొంటుంది. డ్రెయిన్ల ఆక్రమణలతో ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు పూడిక తొలగించేందుకు ఎటువంటి అవకాశం లేకపోవడంతో చేసేదిలేక వెళ్లిపోతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీటి ప్రవాహం నిలిచిపోయి మురుగంతా రోడ్లపై పారుతుంది. దీంతో స్థానికులు మురుగునీటి దుర్గంధం మధ్యనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది

అధికారులు చర్యలు తీసుకోవాలి....

డ్రెయిన్ల ఆక్రమణ సమస్య నగరపాలక సంస్థ అధికారులకు తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా డ్రెయిన్‌లలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దుర్గంధంతో పాటు మురుగునీటి పారుదలకు ఆటంకం కలుగుతుంది. దీనిపై నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా డ్రెయిన్‌లపై ఆక్రమణలు చేపట్టిన దుకాణ యాజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారుల సత్తా



ఖేలో ఇండియా జాతీయ యూత్ గేమ్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల ఐదో తేదీన బీహార్‌లోని గయాలో ప్రారంభమైన ఈ పోటీల్లో నగరానికి చెందిన తీర్థసామ్ దేవ్, సంపత్ కుమార్ యాదవ్ మూడు పతకాలను కైవసం చేసుకున్నారు. ఐదో తేదీన సంపత్ కుమార్ యాదవ్ 200 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఆరో తేదీ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో సంపత్ కుమార్ యాదవ్ గోల్డ్, తీర్థ సామ్ దేవ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉందని ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. పతకాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, మోహన్ వెంకట్ రామ్ అభినందించారు.

శిక్షణ తరగతుల పరిశీలన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయాన్ని పౌరగ్రంథాలయ సంచాలకులు ఎ. కృష్ణమోహన్ మంగళవారం తనిఖీ చేశారు. వేసవి శిక్షణ శిబిరాన్ని , గ్రంథాలయ నిర్వహణను పరిశీలించారు. శిక్షణ తరగతులకు వచ్చే విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రిపరేషన్ తీరును అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వారికి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కంచల నాగరాజు, గ్రేడ్ వన్ లైబ్రరియన్ కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సౌత్ ఏసీపీ పర్యవేక్షణలో గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ నాగ మురళి ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని లాడ్జిలు, హోటల్స్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. హోటల్స్‌లో ఉండే వారి వివరాలతోపాటు అనుమానాస్పద వ్యక్తుల గురించి వాకబు చేశారు. లాడ్జీలు, హోటల్స్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. సరైన గుర్తింపు కార్డులు తీసుకొని రూమ్స్ ఇవ్వాలని, లేని పక్షంలో యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు.

ఆధ్యాత్మికతే సమాజానికి శాంతి మార్గం



అలోక్ కుమార్ ను సత్కరిస్తున్న ధర్మో రక్షిత రక్షత సభ్యుల

విజయవాడ కల్చరల్: ఆధ్యాత్మికతే సమాజానికి శాంతి మార్గమని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్ అన్నారు. నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. భారతీయ సనాతన ధర్మం విశిష్టమైనదని తెలిపారు. దేశ భవిష్యత్ దానిమీద ఆధార పడి ఉందని పేర్కొన్నారు.. భారతీయులకు అనంతమైన ఆధ్యాత్మిక సంపద ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ధర్మోరక్షతి సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు చెప్పారు. తాళ్ళాయ పాలెం శైవపీఠాధిపతి శివస్వామి, ధర్మోరక్షిత రక్షత సభ్యులు హరివెంట సతీష్, మారిశెట్టి మదన్మోహన్, విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి రాఘవులు పాల్గొన్నారు. నిర్వాహకులు అలోక్ కుమార్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయండి

- 20న దేశవ్యాప్త సమ్మె
- డీపీఓకు సమ్మె నోటీస్‌ను అందజేసిన సీఐటీయూ



డీపీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న నేతలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, 132, 142, 680 జీఓలు, టెండర్లపై హైకోర్ట్ తీర్పు అమలు చేయాలని, తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 20న తలపెట్టిన సమ్మె నోటీస్‌ను జిల్లా పంచాయతీ అధికారి కె.లావణ్య కుమారికి సీఐటీయూ నాయకులు అందజేశారు. గొల్లపూడిలోని డీపీఓ కార్యాలయానికి మంగళవారం వెళ్లిన సీఐటీయూ నాయకులు ఆమెను కలిసి సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నేత సోమేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం - 1926, వర్క్‌మెన్ కాంపన్సేషన్ యాక్ట్-1923, వేతనాల చెల్లింపు చట్టం-1935తో పాటు కనీస వేతనాల చట్టం-1948, బోనస్, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి 29 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా మార్చేసిందని వివరించారు. కోడ్స్ కారణంగా కార్మికులు తమ హక్కులను కోల్పోవడం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్నాయని పేర్కొన్నారు.

20న సమ్మె

ప్రమాదకరమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20వ తేదీన దేశవ్యాపిత సమ్మెకు పిలుపు నిచ్చాయని తెలియ చేశారు. రాష్ట్రంలో పంచాయతీ కార్మికులకు గత 8 ఏళ్లగా జీతాలు పెరగలేదని, మున్సిపల్ కార్మికులు నిర్వర్తిస్తున్న విధులనే పంచాయతీ కార్మికులుకూడా చేస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ వారికి రూ.21వేలే జీతం ఇస్తున్నారని అన్నారు. పంచాయతీ కార్మికులకు రాష్ట్రమంతటా ఒకే విధంగా జీతాలు లేవని, రూ.4వేల నుంచి రూ.14వేలులోపే చెల్లిస్తున్నారని తెలిపారు. గతం నుంచి పని చేస్తున్న వారిని టెండర్లతో సంబంధం లేకుండా విధుల్లో కొనసాగించాలని 2015, 2023ల్లో హైకోర్ట్ ఇచ్చిన తీర్పును బుట్టదాఖలు చేశారని చెప్పారు.

పెంచిన విద్యుత్ భారాలు వెంటనే తగ్గించాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మాట్లాడుతున్న మల్లాది విష్ణు పక్కన పార్టీ నాయకులు, కార్యకర్తలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిన విద్యుత్ చార్జీల భారాలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లతో కలిసి పీడబ్ల్యూడీ మైదానం వద్ద గల విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ వెంకటేశ్వరరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధాలు, మోసాలతో అధికారంలోకి రావడం, తీరా వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించడం చంద్రబాబుకు షరామామూలేనని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను భేషరతుగా మాఫీ చేస్తామని నమ్మించి.. చివరకు రైతులను నిలువునా వంచించారని గుర్తుచేశారు. మరలా ఇప్పుడు కరెంటు చార్జీలను తగ్గిస్తామని నమ్మబలికి.. అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే రూ.15,485.36 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఓమాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట చెప్పడం బాబుకి వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. కరెంట్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని పైగా వినియోగదారులే విద్యుత్ అమ్ముకునేలా చేస్తానని ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు బాబు చెప్పిన మాటలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజలపై భారాలు మోపడం, అప్పులు చేయడం బాబుకు కొత్తేమీ కాదన్నారు. గతంలోనూ కరెంట్ చార్జీలు తగ్గించమని అడిగిన అమాయకులపై కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుదని తెలిపారు.

యాక్సిస్ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేయాలి....

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతాంగానికి, గృహ వినియోగదారులకు, పరిశ్రమలకు కరెంట్ కష్టాలు తగ్గించాలని ముందుచూపుతో అతి తక్కువ ధరకు విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటే.. కూటమి నేతలు నానా యాగీ చేశారని మండిపడ్డారు. ఉచిత కరెంటు భవిష్యత్తులో నిరాటంకంగా శాశ్వత ప్రాతిపదికన అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను కారుచౌకగా ఒప్పందం కుదుర్చుకుని రూ.2.49కే ఇవ్వడానికి వైఎస్ జగన్ సిద్ధపడితే, మాపై బురద చల్లిన కూటమి పెద్దలు ఇప్పుడు యూనిట్‌ను ఏకంగా రూ. 4.60కి ఒప్పందం కుదుర్చుకోవటంపై ఏం సమాధానం చెబుతారన్నారని నిలదీశారు. ఇది దేశంలోనే అతిపెద్ద కుంభకోణం కాదా అని ప్రశ్నించారు. ఎవరికి మేలు చేయటానికి యాక్సిస్ ఎనర్జీ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తెరపైకి వచ్చిందో నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సోలార్ విద్యుత్ రేటు తగ్గినప్పటికీ 25 సంవత్సరాల పాటు రూ. 4.60 చెల్లించే రీతిలో ఒప్పందాలు చేసుకోవటం దారుణమని చెప్పారు. ఈ ఒప్పందం వల్ల రూ. 14 వేల కోట్ల అదనపు భారం ప్రజలపై పడుతుందన్నారు. గతంలో ఏపీ ఈఆర్సీ తిరస్కరించిన ఈ అడ్డగోలు ఒప్పందం మరలా తెరపైకి ఎలా వచ్చింది..? ఎలా ఆమోదింపబడిందని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే యాక్సిస్ సంస్థతో చేసుకున్న ఈ అడ్డగోలు ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్ హయాంలో..

వైఎస్ జగన్ హయాంలో ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ప్రజలకు ఊరట కల్పించిందని మల్లాది విష్ణు అన్నారు. వ్యవసాయ అవసరాలకు పెద్దపీట వేస్తూ పగటిపూట నాణ్యమైన విద్యుత్ అందించటం జరిగిందన్నారు. గతంలో టీడీపీ సర్కార్ రైతులకు ఎగ్గొట్టిన రూ. 8,845 కోట్ల ఉచిత విద్యుత్ బకాయిలను వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసరపు దేవీ, యరగొర్ల తిరుపతమ్మ, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అవినీతి ఒప్పందాలతో ప్రజలపై భారాలు మోపొద్దు

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్



సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ చార్జీల భారాలను రద్దు చేయాలని, అవినీతి ఒప్పందాలు చేసుకుని ప్రజలపై భారాలు మోపొద్దని, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.కాశీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాభేరి కార్యక్రమంలో భాగంగా కృష్ణలంక 21వ డివిజన్‌లోని సత్యంగారి హోటల్ సెంటర్‌లో మంగళవారం విద్యుత్ సర్దుబాటు, అదనపు చార్జీలు రద్దు చేయాలని సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా విద్యుత్ భారాలు వేయబోమని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ప్రజలపై రూ.15,400 కోట్ల భారాలు వేశారన్నారు. ఇది చాలదన్నట్లు ఆక్సిస్ అనే సంస్థకు 25 ఏళ్ళ పాటు రూ.4.60పైసలు యూనిట్‌కు ఒప్పందం చేసుకున్నారన్నారు. ప్రజలు, సీపీఎం అభ్యంతరాలు తెలిపినా వాటిని పక్కన పెట్టి నియంత్రణ మండలిని రబ్బరు స్టాంపుగా మార్చి ఒప్పందం చేసుకున్నారని, దీంతో రూ.14వేల కోట్లు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై భారాలు మోపే ఈ విధానాలను సీపీఎం ప్రజలతో కలిసి ఎదుర్కొంటుందన్నారు. పాలకుల చర్యలకు వ్యతిరేకంగా సీపీఎం సంతకాల సేకరణను వారం రోజులు నిర్వహిస్తుందన్నారు. వీటిపై ఈ నెల 7న విద్యుత్ సౌధ వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, నగర కార్యదర్శివర్గ సభ్యుడు కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద హైస్కూల్లో నేటి నుంచి సమ్మర్ క్యాంప్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వేసవి సెలవుల్లో చిన్నారులకు పలు రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి తమ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్ ప్రిన్సిపల్ జి.హరిత మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, మన భాష సంస్కృతి, హిందీ పరిచయ్, చదరంగంలో నామమాత్ర ఫీజులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు చెస్ కోచ్ రామకృష్ణను 9948679397 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

రైల్వేస్టేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు

అనాధికారిక వెండర్స్ నుంచి రూ.4.65 లక్షలు పెనాల్టీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌లో అనాధికారిక విక్రయాలు సాగిస్తూ ప్రయాణికులను నిలువు దోపిడి చేయడంతో పాటు నాసిరకం ఆహార విక్రయాలతో వారి ఆరోగ్యాలతో ఆడుకుంటున్న నకిలీ వెండర్స్‌పై ఇటీవల 'రైల్వే స్టేషన్‌లో నకిలీ వెండర్స్ దందా' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై రైల్వే ఉన్నతాదికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి విజిలెన్స్, ఆర్‌పీఎఫ్ అధికారులు సంయుక్తంగా సోమవారం సాయంత్రం విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎటువంటి ఐడీ కార్డులు, వెండింగ్ పర్మిట్‌లు లేకుండా విక్రయిస్తున్న సుమారు వంద మంది అనాధికార వెండర్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేసిన అనంతరం వారి నుంచి రూ.4,65,000 పెనాల్టీలు విధించారు. రైల్వేస్టేషన్‌లో అనధికారిక వాణిజ్య కార్యకలాపాలను నివారించే లక్ష్యంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విక్రేతల గుర్తింపు కార్డులు, వెండింగ్ పర్మిట్‌లతో సహా విక్రేతల ఆధారాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. లైసెన్స్ పొందిన స్టాల్ నిర్వాహకుల కింద అనుమతులు లేకుండా పనిచేస్తున్న విక్రేతలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. వీటితో పాటు రైల్వే చట్టంలోని సంబంధిత నిబంధనల కింద ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.

ప్రమాదకర కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించండి

వీఎంసీ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించాలని వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు నగర సుందరీకరణలో భాగంగా ఆయన మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో కేబుల్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ అవసరం లేని, వినియోగంలో లేని వైర్లను క్రమబద్ధీకరించి వారం రోజుల్లోగా తొలగించాలన్నారు. నిబంధనలను అమలు చేయకపోతే వారం తర్వాత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

నేత్రపర్వంగా పాండురంగడి పుష్పయాగం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగ, సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారి పుష్పయాగం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం త్రయోదశి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగడి ఉత్సవమూర్తులకు తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామి వారి నామాలను పఠిస్తూ, కీర్తనలు ఆలపిస్తూ పుష్పయాగం చేశారు. సుమారు రెండు గంటల పాటు భక్తుల నామస్మరణలు, మంగళవాయిద్యాలు, అర్చకస్వాములు మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి పుష్పయాగం రమణీయంగా సాగింది. వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు, అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు నిర్వహించారు.